# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 184
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఏప్రిల్ 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## భూభారతితో సమస్యల పరిష్కారం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య



8లో..

## ప్రజా పాలనలో.. ప్రతి ఒక్కరికీ న్యాయం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో వినతుల స్వీకరణ



2లో..

## సరస్వతి పుష్కరాలకు ఏర్పాట్లు ముమ్మరం

- పనులను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ
- నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలంటూ ఆదేశం




8లో..

## కార్యకర్తలే పునాదిరాళ్లు

- వారు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది
- పార్టీ సిద్ధాంతాలను తెలిపేందుకే శిక్షణ కార్యక్రమం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఆదివాసీ కార్యకర్త సమ్మేళన్ శిక్షణ ప్రారంభం

## న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- డబుల్ బెడ్ రూం సాధించుకుంటాం
- వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు

8లో..




# పోచంపల్లికి అందాల భామలు

## చేనేతకు విశిష్ఠ గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు




- ఏర్పాట్లు చేస్తున్న టూరిజం శాఖ
- మే 7 నుంచి 31వరకు మిస్ వరల్డ్ పోటీలు
- ఆతిథ్యమిస్తున్న తెలంగాణ
- 15న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి సందర్శన
- 120 దేశాల నుంచి తరలి రానున్న సుందరీమణులు

తెలంగాణ వేదికగా మే 7 నుంచి 31వరకు 72వ ప్రపంచ అందాల పోటీలు అట్టహాసంగా జరుగనున్నాయి. మిస్ వరల్డ్ ప్రారంభ, ముగింపు వేడుకలతో పాటు గ్రాండ్ ఫినాలే పోటీలను హైదరాబాద్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొననున్నారు. అయితే తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా ఈ పోటీలను ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. తెలంగాణ చేనేత వస్త్రాలను ఫ్యాషన్ ప్రపంచానికి మరింత చేరువ చేయడం ద్వారా నేతన్నలకు భరోసా కల్పించేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఈ పోటీలకు వచ్చే ఐరోపా దేశాల ప్రతినిధులు, పలువురు పోటీదారులను రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 15న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. వారితో పోచంపల్లి చేనేత వస్త్రాల ధరింప చేసి, వాటిని ప్రమోట్ చేయించాలని భావిస్తోంది. అలాగే గద్వాల్ సిల్క్, సిద్దిపేట దగ్గరలోని గొల్లభామ కాటన్, నారాయణపేట వస్త్రాలకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా పోచంపల్లిలో ఏర్పాటు చేస్తోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..

# పోచంపల్లికి.. అందాల భామలు



- చేనేతకు విశిష్ఠ గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు
- ఏర్పాట్లు చేస్తున్న టూరిజం శాఖ
- మే 7 నుంచి 31వరకు మిస్ వరల్డ్ పోటీలు
- ఆతిథ్యమిస్తున్న తెలంగాణ
- 15న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి సందర్శన
- 120 దేశాల నుంచి తరలి రానున్న సుందరీమణులు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హైదరాబాద్ వేదికగా మే 7 నుంచి 31వరకు నిర్వహించనున్న 72వ ప్రపంచ అందాల పోటీలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. మిస్ వరల్డ్-2025 పోటీల్లో చేనేతకు విశిష్ఠ గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. పోటీలో భాగంగా నిర్వహించే ఫ్యాషన్ రౌండ్, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాల్లోనూ పోటీదారులు తెలంగాణ చేనేత వస్త్రాలనే ధరించనున్నారు. ఇందుకోసం సంప్రదాయ, ఆధునిక డిజైన్ల కలయికగా చేనేత వస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. అదేవిదంగా గ్రాండ్ ఫినాలేలోనూ చేనేత వస్త్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నారు.

### అతిథులకు కూడా..

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు యాదగిరిగుట్టపై నెలవై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ బృందంలోని సభ్యులంతా చేనేత వస్త్రాలు ధరించేలా పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుంది. అంతేకాక, అతిథులకు బహుమతిగా కూడా చేనేత వస్త్రాలనే బహుకరించనున్నారు. కాగా, పోచంపల్లి వెళ్లే యూరప్ బృందం, యాదగిరిగుట్టకు వెళ్లే మరో ప్రతినిధి బృందం ధరించే చేనేత వస్త్రాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా వీడియో ఆల్బమ్ రూపొందిస్తోంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ చేనేత కళకు మరింత ప్రాచుర్యం తీసుకురావడం ద్వారా నేతన్నకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.


### ప్రత్యేక స్టాల్స్..

చేనేతకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రత్యేక స్టాల్స్ ను ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా స్థానిక చేనేత కళపై అతిథులకు అవగాహన కల్పించడమే కాక ఆయా వస్త్రాల ప్రత్యేకతలను తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విదేశీ ప్రతినిధులు స్థానిక చేనేత కళాకారులతో మాట్లాడడానికి భాషాపరమైన సమస్యలు లేకుండా ట్రాన్స్‌లేటర్లను కూడా సిద్ధం చేశారు. అలాగే, గద్వాల్ సిల్క్, గొల్లభామ కాటన్, నారాయణపేట వస్త్రాలకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా పోచంపల్లిలో ఏర్పాటు చేయనున్నారు. విదేశీ అతిథుల కోసం పోచంపల్లిలో తెలంగాణ జానపద కళా ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.



## పుష్కరాలకు ఏర్పాట్లు ముమ్మరం

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి పుష్కరాల ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం పరిశీలించారు. తొలుల వీఐపీ ఘాట్ వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వాటర్ క్యూరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ర్యాంపు, మరుగుదొడ్ల నిర్మాణం, సరస్వతి దేవి విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. అక్కడి నుంచి ప్రధాన ఘాట్ వద్దకు చేరుకొని అక్కడ జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి కుమార్, డీపీఓ నారాయణ రావు, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## తాలు, తరుగు పేరిట కోతలొద్దు

**⇒ వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి ఉత్తమ్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రణాళికాబద్ధంగా యాసంగి పంట కొనుగోలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ తో కలిసి జిల్లా కలెక్టర్ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తాలు, తరుగు పేరిట కోతలు పెట్టొద్దంటూ సూచించారు. ఈ విషయంలో కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో సమస్యల పరిష్కారం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లి సమీపంలోని వీఆర్ బాంక్వెట్ హాల్ లో శనివారం హనుమకొండ మండల స్థాయి రైతులకు భూభారతి చట్టంపై కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై నాయిని మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా వడ్డేపల్లికి చెందిన రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాత రైతులు, భూ యజమానులు ఇబ్బందులు పడ్డారని, ఆ ఇబ్బందులన్నీ భూ భారతి ద్వారా తొలగిపోతాయన్నారు. ఇప్పటికే 26 డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్ల ప్రకటించారు. ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో భూసమస్యలను పరిష్కరించేందుకు రైతులు, ప్రజలు, మేధావుల అభిప్రాయాలు, సూచనలతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందన్నారు. రైతు సమస్యలు పరిష్కరించుకునే అవకాశం గతంలో ధరణిలో లేదని, కానీ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. రైతులు, భూ యజమానులు భూభారతి చట్టం ద్వారా తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా భూభారతి చట్టంలోని అంశాలను ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కాగా హనుమకొండ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, భూ యజమానులు, ప్రజలు తమతమ భూసమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ అవగాహన సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు, భూయజమానులు అడిగిన ప్రశ్నలకు భూభారతి చట్టం ద్వారా వాటికి ఉన్న పరిష్కారాలను హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, హనుమకొండ నాయబ్ తహసీల్దార్ రంజిత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీలత, ఇతర అధికారులతో పాటు హనుమకొండ మండలంలోని వివిధ గ్రామాల రైతులు, భూయజమానులు పాల్గొన్నారు.

### దుగ్గొండిలో..

భూభారతి చట్టం-2025 ననుసరించి నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని దుగ్గొండి రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ , నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు పాల్గొని భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్టీఓ ఉమారాణి, దుగ్గొండి తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి, మండల ప్రత్యేక అధికారి జి.సంగీతలక్ష్మి, ఎంపీడీవో అరుంధతి, ఏఎంసీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పాల్వాయి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# విశ్వహిందూ పరిషత్ భారీ నిరసన

## • అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం



**వరంగల్ వాయిస్, జనగామ :** జీహాదీ తీవ్రవాదులను, రోహింగ్యాలను, టీఎంసీ గూండాలను దేశం నుంచి తరిమివేయాలని విశ్వహిందూ పరిషత్ నేత డాక్టర్ మోహనకృష్ణ భార్గవ డిమాండ్★చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ బోర్డు ప్రకటన అనంతరం పశ్చిమ బెంగాల్ లో చోటుచేసుకుంటున్న అల్లర్లు, హిందువులపై దాడులను నిరసిస్తూ శనివారం విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. బస్టాండ్ శివాజీ చౌక్ నుంచి బైక్ ర్యాలీ చేపట్టి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, నినాదాలు చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ను కలిసి వెంటనే బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రపతికి చేరేలా వినతిపత్రాన్ని సమర్పించారు. అట్టి పత్రాన్ని తప్పకుండా పై అధికారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ మమతా బెనర్జీ హిందువుల పట్ల కక్ష్య పూరితంగా ఇట్టి కుట్రలకు తెరతీసిందని జీహాదీ తీవ్రవాదులను, రోహింగ్యాలను, టీఎంసీ గూండాలను హిందువులపై ఉసిగొలిపి అల్లర్లకు పాల్పడిందన్నారు. హిందువులపై అకృత్యాలు, అమానుష దాడులు, మహిళలపై అత్యాచారాలతో అమానుష దాడులకు పాల్పడుతున్నారని, హిందువులు భయాందోళనలకు గురై బెంగాల్ వదిలి పారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టీఎంసీ ప్రభుత్వాన్ని బహిష్కరించి, మమతా బెనర్జీని అరెస్ట్ చేసి, తీవ్రవాదులను దేశం నుంచి తరిమివేయాలని ఈ చర్యల్లో పాల్గొన్న ఎవ్వరిని వదిలిపెట్టకుండా శిక్షించాలని, వెంటనే బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ పీ జిల్లా ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, బాలనారాయణ, కోశాధికారి రంగ నర్సింహ్మారావు, పట్టణ అధ్యక్షులు అంబటి బాలరాజు, సభ్యులు రవికుమార్, హర్షవర్ధన్, బైరునాథ్, సుంచు శ్రీకాంత్, ఆంజనేయులు, రామకృష్ణ, రాథోడ్, ఉపేందర్, వేణుగోపాల్, సత్యనారాయణ, కేదారీశ్వర్, నాగరాజు, రమేష్, శ్రీకాంత్, అనీల్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు సెల్యూట్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగర ప్రజలకు, ప్రయాణికులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించే గ్రీన్ మ్యాట్ షెల్టర్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. పోచమ్మ మైదాన్ బస్ షెల్టర్ కు తాత్కాలిక ఉపశమనం కల్పించారు. పోచమ్మ మైదాన్ లో బస్ షెల్టర్ పై కప్పు లేక గత రెండు సంవత్సరాలుగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి అక్కడ గ్రీన్ మ్యాట్ లను ఏర్పాట చేసి నీడ సౌకర్యం కల్పించారు. ప్రయాణికులు పోచమ్మ మైదాన్ బస్ సెంటర్లో నీడలన నిలబడే అవకాశం కల్పించిన వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణకు, అలాగే సిబ్బందికి నగర ప్రజలు సెల్యూట్ ట్రాఫిక్ పోలీసులు అంటూ కితాబునిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ రామకృష్ణ మాట్లాడుతూ ఎండ తీవ్రతకు వాహనదారులు, ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలో పలుచోట్ల ప్రయాణించే వాహనదారులు సిగ్నల్స్ వద్ద ఆగినప్పుడు బస్టాండ్లకు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడకుండా గ్రీన్ మ్యాట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# వరద నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం చూపాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఉర్సు చెరువు మత్తడి నుంచి వచ్చే వరదనీరు జేఎస్ఎమ్ కాలనీలోని ప్లాట్లలో నిలువకుండా బయటికి వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో కాలనీ ప్లాట్ యజమానుల విన్నపం మేరకు ఆయన, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డితో కలిసి చెరువు మత్తడి నుంచి భట్టుపల్లి బైపాస్ రోడ్డు వరకు పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కచ్చ కాలువ పూర్తిగా మట్టితో నిండి ఉండటంతో నీరు కాలనీలో నిల్వవుతున్నట్లు గుర్తించామని చెప్పారు. జేఎస్ఎమ్ కాలనీ వాసులు తమ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చెల్లించామని, కొందరైతే బిల్డింగ్ పర్మిషన్ కూడా తీసుకున్నామని, అయినప్పటికీ నీటి నిల్వ వల్ల ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టలేకపోతున్నామని వాపోయారు. కార్పొరేటర్ రవి ఈ విషయంపై స్పందించి, సమస్యను మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ చెరువు నుంచి వచ్చే నీరు పూర్తిగా బయటకు వెళ్లేందుకు శాశ్వతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులను సమాచారం చేస్తానని తెలిపారు. ఈ పరిశీలనలో కాలనీ ప్రతినిధులు పి.శ్యాంప్రసాద్, డి.రమేష్, జి.చల్మారెడ్డి, కె.శ్రీనివాస్, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణను సన్మానించిన ప్రజా సంఘాలు



**వరంగల్ వాయిస్,ఆత్మకూరు :** మహనీయుల బాటలో నిరంతరం పయనిస్తూ సమ సమాజానికై నిరంతరం పాటుపడుతున్న గొప్ప నాయకుడు, పేదల డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ కొనియాడారు. దళిత రత్న అవార్డు పొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణను శనివారం మండలంలోని అక్కంపేట, నాగయ్య పల్లె గ్రామాలలో దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా మాదాసి సురేష్ మాట్లాడుతూ దళిత రత్న అవార్డు రావడంతో దళిత, బహుజన ప్రజల సమస్యలపై పోరాడడంలో, పరిష్కరించడంలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంతవరకు ప్రశ్నించే గొంతుకగా నిలుస్తూ పేదలు, దళితులు, బహుజన వర్గాలు, మహిళల సమస్యలపై నిరంతరం పోరాడుతానని, వారి సమస్యలను పరిష్కరించడంలో ముందు వరుసలో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై బాపు–జై భీమ్, జై సంవిధాన్ పరకాల నియోజకవర్గం ఇంచార్జి కూచన రవళి రెడ్డి, దళిత ప్రజా సంఘాల నాయకులు సిలువేరు భిక్షపతి, జినుక అశోక్, మాదాసి రాజు, నన్నేబోయిన మల్లికార్జున్, సిలువేరు రాజు, మాదాసి భిక్షపతి, గిన్నారపు ప్రమీల, గిన్నారపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాయపర్తి మండలం కొండాపురం గ్రామానికి చెందిన ఎంపీ కడియం కావ్య సమీప బంధువు జిలకర భిక్షపతి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా శనివారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడ సానుభూతి తెలియజేశారు. అనంతరం కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బత్తిని రాజ్యలక్ష్మి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య వెంట తొర్రూరు బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హమ్య నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు ఎనగందుల మురళి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మాందాటి సుదర్శన్ రెడ్డి, మాదారపు అశోక్, ఆకుల సురేందర్ రావు, ఎండీ నయీం, ఎండీ ఖదీర్, సోమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవుల రన్ ఫర్ జీసస్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో పరకాల పాస్టర్స్ ఫెలో షిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ఎల్ఐసీ ఆఫీస్ నుంచి బస్సు డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ అనగా యేసుక్రీస్తు పునర్ధానం అనగా తిరిగి లేచిన దినంగా ప్రకటించుట గూర్చి ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ మిషనరీ ఇంచార్జి రేవ.. ప్రత్యూస్ బాబు, పరకాల మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ ఎస్ఎల్ దేవదాస్, సెక్రెటరీ బోట్ల శ్యామ్ పాల్, ట్రెసర్ కే కొటేశ్వర్, వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ ఎ.ఎలీషా, ఏలీయా పాస్టర్ మోసెస్, పాస్టర్ రాజు, పాస్టర్ మొగిలి, పాస్టర్ సంజీవ, పాస్టర్ సాల్మన్, కాంగ్రెస్ పార్టీ పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు మడికొండ సంపత్, పసుల అన్న స్వామి, బొచ్చు జెమిని, దొమ్మటి బాబురావు, బొచ్చు సంపత్, దుప్పటి రాజేష్, ఎస్ఎఫ్ఐ, జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, వివిధ సంఘాల సభ్యులు మడికొండ జేమ్స్, ఒంటేరు ప్రవళిక, ఒంటేరు మనోహర్, మడికొండ జనార్ధన్, ఒంటేరు ప్రమోద్, ఒంటేరు అమర్నాథ్, బొచ్చు అనిల్, బొచ్చు భద్రయ్య, శాంతి కుమార్, ఆంటోని, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో గెలుస్తాం.. నిలుస్తాం



**వరంగల్ వాయిస్, నడికూడ:** ముదిరాజ్ జాతి అభివృద్ధే లక్ష్యంగా విద్య, ఉద్యోగం, రాజకీయ సాధికారత దిశగా ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తూ, ముదిరాజ్ కుల బంధువుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న మెపా సంస్థ – "గ్రామాల్లో గెలుస్తాం.. నిలుస్తాం" అనే నినాదంతో ముందుకు సాగుతోంది. సంఖ్యా పరంగా ముదిరాజ్ లు అధికంగా ఉన్నప్పటికీ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఇంకా వెనుకబడిన స్థితిలో ఉన్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసా రమేష్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ రవి ముదిరాజ్ తెలిపారు. వారు పేర్కొంటూ, "విద్యే ముదిరాజ్ ల అభివృద్ధికి మార్గదర్శి. ఈ దిశగా చైతన్య కార్యక్రమాలు, ప్రగతికి దోహదపడే చర్యలు తీసుకుంటూ, గ్రామ స్థాయిలో ముదిరాజ్ లను చైతన్యవంతులుగా మార్చే పనిలో ఉన్నామని చెప్పారు. ఇకపై గ్రామ స్థాయిలో ప్రతీ ముదిరాజ్ కుటుంబాన్ని కలుస్తూ, వారికి అవగాహన కలిగిస్తూ, విద్య, ఉద్యోగం, రాజకీయ సాధికారతపై దృష్టి పెట్టేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. యువతరం ఈ అవకాశాలను వినియోగించుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, అందరూ ఒక తాటిపైకి వచ్చి సంఘీభావంగా ముందుకు సాగాలని కోరారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు విరాళం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాష్ట్ర సమితి పార్టీ 25వ రజతోత్సవ సభను ఈ నెల 27న ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో శనివారం 31 వ డివిజన్ న్యూశాయంపేట బస్టాండ్ వద్ద గులాబీ జెండాను ఎగరవేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. తర్వాత ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాయంపేట కార్యకర్తలు పే బ్యాక్ టు పార్టీ అనే నినాదంతో 1.30 ,000/- లక్షా ముప్పై వేల రూపాయలను సమీకరించి బహిరంగ సభ ఖర్చులకోసం మాజీ చీఫ్ విప్, హనుమకొండ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాయంపేట బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం అందిందని, గత పదేండ్లు కేసీఆర్ మమల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపారని, నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వెంటే ఉన్నామని, ఇప్పుడు మేము కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు ఈ నెల 27న ఓరుగల్లులో నిర్వహించే బహిరంగ సభకు విరాళం ప్రకటించామని తెలిపారు. మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వడ్డేపల్లి పుట్టినిల్లు అయితే శాయంపేట తనను పెంచిన గడ్డ అని పేర్కొన్నారు. రాజకీయ జన్మనిచ్చిందని అన్నారు. తాను ఎప్పుడు ఎన్నికల్లో పోటీ చేసినా శాయంపేట ప్రజలు తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించి విరాళాలు ఇచ్చారని గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి రజతోత్సవాల నేపథ్యంలో కార్యక్రమాల నిమిత్తం లక్ష ముప్పై వేల రూపాయలు విరాళం అందజేసిన కార్యకర్తలను అభినందించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని అన్నారు. తెలంగాణ కోసం నాడు, నేడు, రేపు పోరాడేది, కొట్లాడేది బీఆర్ఎస్, గులాబీ సైనికులు మాత్రమే అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన నాటి నుంచి నేటి భారత రాష్ట్ర సమితి వరకు గులాబీ జెండాను మోసిన, పార్టీకి 2001 నుంచి అండగా ఉన్న సీనియర్ కార్యకర్తలు అయిన నాగేశ్వర్ రావు, ప్రభాకర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, జానకి రాములు, సంపత్, సదానందం, ఫాతిమా చారి, వెంకటేశ్వర్లు, రాజు, వెంకన్న, రాకేష్ యాదవ్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అక్షితకు నారీ శక్తి అవార్డు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నాడీ వైద్యంలో విశిష్ట సేవలు అందిస్తూ అమెరికా నుంచి ధన్వంతరి ఆయుర్వేద అవార్డు, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా హైదరాబాద్ లో శుక్రవారం స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఎన్జీవో వారు డాక్టర్ అక్షితకు భారత నారీ శక్తి ఇంటర్నేషనల్ అవార్డును ప్రధానం చేశారు. నాడీ వైద్యరంగంలో కరీంనగర్, బెంగుళూర్, హైదరాబాద్ లో డాక్టర్ అక్షిత చేస్తున్న ఉచిత వైద్య సేవలను గుర్తించిన స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఎన్జీవో ఈ అవార్డును ఆమె సేవలకు గుర్తింపుగా అందజేశారు. సిరిసిల్లకు చెందిన డాక్టర్ అక్షిత పద్మశాలి కులంలో పుట్టి తన ప్రతిభతో దేశ, విదేశాలో, రాష్ట్రాలో గుర్తింపును పొందుతుంది. ఇప్పటికే నాడీ వైద్యంలో తెలంగాణ నుంచి ఉత్తమ డాక్టర్ గా గుర్తింపు పొందిన ఆమెను మన పద్మశాలీ కులబాంధవులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందిస్తూ మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# జేఈఈ ఫలితాల్లో మనుపాటి సాగర్ ప్రతిభ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన వెల్ది మోడల్ స్కూల్ కాలేజ్ విద్యార్థి మనుపాటి సాగర్, నిన్న విడుదలైన JEE మెయిన్స్ ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. అతను ఆల్ ఇండియా క్యాటగిరీలో 7626 ర్యాంకు సాధించడమే కాకుండా, JEE అడ్వాన్స్డ్కు అర్హత కూడా పొందాడు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు మోడల్ స్కూల్ లోనే విద్యనభ్యసించిన సాగర్ ఈ విజయం సాధించాడు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్, ఆంగ్ల ఉపాధ్యాయుడు, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ గణేష్ కందగట్ల సాగర్‌ను అభినందించారు. ప్రభుత్వ విద్యతోనే ఇలా ఖర్చు లేకుండా ఉన్నత ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటూ, తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ స్కూల్‌కి చేర్పించాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. సాగర్ విజయంపై ఆయన తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లం శ్రీధర్, రాజు, మోహన్ రావు, శ్రీను, రవి, సౌజన్య ప్రియ, రుద్రమదేవి, విజయ, శశికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**వరంగల్ వాయిస్, పరకాల:** మండలంలోని పోచారం, లక్ష్మీపురం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దేశాల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ఐకేపీ నోడల్ ఆఫీసర్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ, "రైతులు దళారులను నమ్మి బయట ధాన్యం అమ్మకూడదన్నారు. ప్రభుత్వమే ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి," అని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాసరి బిక్షపతి, బుడిమె రాజయ్య, పోచారం గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి అశోక్, పరకాల సమన్వయ కమిటీ సభ్యులు కొలిపాక చందు, కోరే శ్రీనివాస్, పాక్స్ డైరెక్టర్ కొలిపాక అర్జున్, పాక్స్ పరకాల కార్యనిర్వాహణాధికారి నాగరాజు, రాయపర్తి మాజీ ఎంపీటీసీ పర్నం మల్లారెడ్డి, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ పల్లెబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆలేటి రవీందర్, చిలువేరు మల్లయ్య, గ్రామ కమిటీ సభ్యులు పల్లెబోయిన భాస్కర్, బండారి నరేష్, మంగళపెల్లి సాంబయ్య, పి. మొగిలి, సెంటర్ ఇంచార్జి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మానసిక రుగ్మతలపైన విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తిరుమలగిరి గ్రామంలోని కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మానసిక రుగ్మతలపై ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రహసిత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థుల్లో నెలకొన్న మానసిక రుగ్మతలైన మానసిక ఒత్తిడి, జ్ఞాపకశక్తి మందగించడం పరీక్షలు, ఆటల్లో ఓటమి భయం, ఒంటరితనం వంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి నుంచి దూరం కావడానికి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడకూడదన్నారు. విద్యార్థులు ఎలాంటి మానసిక సమస్యలు ఉన్న వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 14416 ఫోన్ చేసి సమస్యలకు పరిష్కారం పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పీహెచ్ సీ డాక్టర్ స్వాతి, సూపర్ వైజర్ కందగట్ల సంపత్, పాఠశాల ప్రిన్సిపల్ వాసవి, ఏఎన్ఎం రూప, ఆశా వర్కర్ విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖను కలిసిన వరంగల్ బార్ అసోసియేషన్ కమిటీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ( జిల్లా న్యాయ వాదుల సంఘం ) ఇటీవల నూతనంగా ఎన్నికైన సందర్భంగా, రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా శనివారం ఆమె నివాసంలో కలిసి శాలువా పుష్పగుచ్చాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వలుస సుధీర్ వరంగల్ బార్ అసోసియేషన్, కోర్టు సమస్యలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు సుధీర్ వలుస, ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, బార్ ఉపాధ్యక్షులు మైదాం జయపాల్, జాయింట్ సెక్రెటరీ ముసిపట్ల శ్రీధర్ గౌడ్, లేడీ జాయింట్ సెక్రటరీ రేవూరి శశిరేఖ, కోశాధికారి సిరిమల్ల అరుణ, స్పోర్ట్స్ సెక్రటరీ శివప్రసాద్, ఈసీ మెంబెర్స్, రాజు, మహేందర్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ మహిళా హోంగార్డ్ కు సత్కారం




**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైం :** సుధీర్ఘ కాలం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో హోంగార్ విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన మహిళా హోం గార్డ్ పార్వతి మెహతను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం తన కార్యాలయంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్ లో ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని సీపీ పదవి విరమణ చేసిన హోం గార్డ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, ఆర్.ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలులు, పిడుగులతో రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోయారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాజా వర్షాలతో పలు ప్రాంతాల్లో పంటలు నాశనమయ్యాయని, చేతికి వచ్చిన పంట నేలపాలైందని, వరిధాన్యం తడిసి ముద్దైందని, మామిడికాయలు రాలిపోయాయని తెలిపారు. ఈ పరిస్థితులు అన్నదాతలను కన్నీరు పెట్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ ప్రాంతంలో కౌలు రైతు నరసింహులు వరి పంట నాశనమైనందుకు మనస్థాపంతో గుండె పోటుకు గురై ఆసుపత్రిలో చేరిన ఘటన బాధాకరమని అన్నారు. విపరీతమైన గాలిదుమారాల వల్ల చెట్లు విరిగిపోవడం, పేదల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోవడం, కొన్నింటిని పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసం చేయడం వంటి నష్టాలు చోటు చేసుకున్నాయి. అలాగే పిడుగులు పడటం వల్ల పశువులు మృతి చెందాయి. ప్రకృతి బీభత్సంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంకట్రాములు చెప్పారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం నష్టాలు గూర్చిన ప్రాంతాలను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి, నివేదికలు తయారు చేసి, తక్షణ నష్టపరిహారం అందించాలన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, ఏప్రిల్ 19, 2025

# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

## ◆ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను పండుగగా నిర్వహించి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహబూబాబాద్ నియోజకవర్గం నుండి కనీసం 10 వేల మందిని బస్సులు, డీసీఎంలు, తుఫాన్లు వంటి వాహనాలలో ఎల్కతుర్తికి తరలించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి మాజీ ప్రజా ప్రతినిధులు ఇంచార్జులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమం ఏంటో రుచి చూపించిన నేత ఎన్టీఆర్ అయితే, కేసీఆర్ మాత్రం సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కడుపు నింపిన మహానాయకుడు అన్నారు. గత 15 నెలలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పాలనలో అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్రాన్ని దివాళా స్థితికి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను, నిరుపేదల బాధలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ, నాయకత్వంలో లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేసీఆర్ వంటి గొప్ప నాయకుడు, రానున్న రోజుల్లో తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సపోర్టింగ్ స్టాఫ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ జనసమితి (టీజేఎస్) నేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ప్రభుత్వ జీవో నం.60 ప్రకారం సపోర్టింగ్ స్టాఫ్ బేసిక్ వేతనం పెరిగినా, జీఎస్టీ సహా ఇతర మినహాయింపుల వల్ల వారికి చేతికి రావాల్సిన వేతనం కేవలం రూ.9,917 మాత్రమే అందుతోందని తెలిపారు. కనీసం రూ.13,600 నగదు రావాల్సి ఉందని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. జూన్ 2021 నుంచి పెరిగిన వేతనాలు అమలుకావాల్సి ఉన్నా ఇంకా అందకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో మెరిట్ పద్ధతిలో నియమితులై కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌ను ఇటీవల ఏజెన్సీలకు అప్పగించడాన్ని విమర్శించారు. వీరిని మళ్లీ కాంట్రాక్ట్ విధానంలోనే కొనసాగించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. 2018 నుంచిఇప్పటి వరకు కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్ వేతనాల్లో నుండి మినహాయించిన ప్రావిడెంట్ ఫండ్ కాంట్రిబ్యూషన్ మొత్తం స్టేట్ హెల్త్ సొసైటీ, డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ, ఏజెన్సీల ద్వారా వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ సందర్భంగా టీజేఎస్ కేవీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, బస్తీ దవాఖాన కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగళపాటి సుమన్, కన్వీనర్ మెతుకు ఉప్పలయ్య, సభ్యులు స్వప్న, శాంతమ్మ, పావని, హారిక, అనిత, అంబికా, మహేష్, భావిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అత్యంత సురక్షితమైంది

## ఏజీఎం దయాకర్




**వరంగల్ వాయిస్, జనగామ:** ఏప్రిల్ నెలను వినియోగదారుల సేవల మాసంగా పాటిస్తున్న సందర్భంగా, శనివారం జనగామ బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంగణంలో వినియోగదారుల సేవా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏజీఎం దయాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అత్యంత భద్రమైనదని, వినియోగదారుల డేటా సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యతనిచ్చినదని తెలిపారు. ఈ శిబిరంలో జనగామ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 100 మంది వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు, సూచనలను తెలియజేశారు. బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న వివిధ సేవలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఎఫ్‌టీటీహెచ్ ఇంటర్నెట్ సేవలపై ఎస్‌డీఈ చంద్రగిరి ప్రసాద్, మొబైల్ సిగ్నల్స్, సిమ్ కార్డ్ సంబంధిత విషయాలపై రాంప్రసాద్, షఫీక్, అలాగే ఫైబర్ సేవలపై శ్రీహరి విశదంగా వివరించారు. దయాకర్ మాట్లాడుతూ కేవలం రూ.2360కే 6 నెలల ఇంటర్నెట్ సేవలతో పాటు ఉచిత ల్యాండ్‌లైన్ ఫోన్ సేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం ప్రతి టవర్‌ను 4జీ నెట్‌వర్క్‌కు అప్గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించి డేటా భద్రత మరింత పటిష్టంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ఎలేందర్, రామచందర్, అలాగే ఫ్రాంచైజీ సిబ్బంది శరత్, రమేష్, శ్రీనివాస్, కిరణ్, ఉప్పలయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తి వద్ద జరగబోయే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజతోత్సవ సభ – "చలో వరంగల్" కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే బీఆర్ఎస్ కార్యకర్తలకు ట్రాఫిక్ సమస్యలు, వసతుల లోపం, సభా ప్రాంగణం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ఉండేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్





బండా ప్రకాష్ ముదిరాజ్ సభా స్థలాన్ని స్వయంగా సందర్శించి వేదిక పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిలతో కలిసి సమావేశమై అవసరమైన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించి విలువైన సూచనలు అందించారు. సభ విజయవంతం కావడమే లక్ష్యంగా ప్రతి అంశాన్ని సమగ్రంగా పర్యవేక్షిస్తున్నామని బండా ప్రకాష్ తెలిపారు.

# బైరి అనూషకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ బయో టెక్నాలజీ విభాగ పరిశోధకురాలు బైరి అనూషకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ను ప్రకటించారు. డాక్టర్ బైరి అనూష "టిష్యూ కల్చర్, ఫితోకెమికల్ ఎనాలిసిస్ అండ్ ఫార్మసీలోజికల్ స్టడీస్ ఐన్ ఆర్టిమిష్యా నిలగిరికా (క్లార్కెట్), ప్యాంప్ "అనే అంశంపై విభాగ విశ్రాంత సహా ఆచార్యులు డాక్టర్ టి.క్రిస్టోఫర్ రుబెన్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కరీంనగర్ కు చెందిన డాక్టర్ బైరి అనూషను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

## ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి




**వరంగల్ వాయిస్, నడికూడ :** వరి ధాన్యం రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సక్కపల్లిలో వివేకానంద గ్రామైక్య సంఘం, చర్లపల్లి కనకదుర్గ గ్రామైక్య సంఘం, నార్లపూర్ సోనియా గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమాదేవి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మల్హల్ రావు, సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, మహిళా సంఘ సభ్యులు ఎం.స్వరూప, ప్రవళిక, దీప, లావణ్య, బైరి స్వప్న, అమ్మ హారిక, కందకట్ల రమ, నందికొండ ధనలక్ష్మి, నీలం సానియా, శనిగరం స్వరూప, శోభ, చంద్రకళ, ఉమామహేశ్వరి, సౌందర్య, సిసి రేణుక, కుమారస్వామి, రైతులు పాల్గొన్నారు.

# శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా ఈ నెల 21న చేపట్టే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని వక్ఫ్ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్ ప్రజలను కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఉమర్ ఫరూక్ మసీద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపోజ్డ్ వక్ఫ్ చట్ట సవరణ ముస్లిం సోదరుల మతపరమైన, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపును బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా, ఈ సవరణలు భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేవి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతీ వర్గం ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు ఈ శాంతి ర్యాలీలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, ముస్లిం మత పెద్దలు, వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం



**వరంగల్ వాయిస్, లింగాల గణపురం :** మండలంలోని నెల్లుట్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రెండు ఆటోలను లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి గాయాలు అయినట్లు సమాచారం.

# ఘనంగా అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పద్మాక్షి రోడ్డులో ఉన్న హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. బ్రహ్మశ్రీ ఆరుట్ల రామాచార్యులు వేదమంత్రోచ్చారణలతో స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, జిల్లేడు ఆకులతో అర్చన నిర్వహించారు. అనంతరం హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించబడింది. భజన అనంతరం స్వామివారి ఆశీస్సులతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బెండల అర్జున్ రావు, కార్యదర్శి గందె కృష్ణ, అన్నదాన కమిటీ కార్యదర్శి కనుకుంట్ల రవి కుమార్, గంద్రటి సుధాకర్, సీతా సమ్మయ్య, గుండు శంకర్, మాదాసు మొగులయ్య, ప్రభాకర్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# సన్న బియ్యంతో సహపంక్తి భోజనం



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని ముద్దునూరులో సన్న బియ్యం లబ్ధిదారుడు దిద్దే సరోజన- చేరాలు కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగారు. మీతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎంపీ పోరిక బలరాం నాయక్, మ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం చాలా బాగుందన్నారు. ఇప్పటి వరకే రేషన్ దుకాణాల్లో 90శాతం పంపిణీ పూర్తి అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కాలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారులకు శిక్షణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని రైతులందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు 11 అంకెలు గల విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. శనివారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందిని ఉద్దేశించి, క్షేత్రస్థాయిలోని ప్రతి రైతు రైతు రిజిస్ట్రేషన్ లో పాలుపంచుకునే విధంగా, విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుకునేందుకు ఉపయోగమన్నారు. రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడి) పొందుటకు మీ ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకం ఆధార్ కు లింకు చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని సమీపంలో వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. గౌస్ హైదర్ సహాయ వ్యవసాయ సంచాలకులు, సాంకేతిక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టును సందర్శించిన హైకోర్టు జడ్జి

## ◆ స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కోర్టు భవనాన్ని హైకోర్టు పరిపాలన జడ్జి జె.అనిల్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి డి.రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గుమస్తా సంఘ భవనం, ఈ–సేవ కేంద్రం, మహిళా బార్ అసోసియేషన్ హాల్, లాకర్ రూమ్ లను కూడా ఆయన పరిశీలన చేశారు. ప్రధాన రహదారి పక్కన కోర్టు భవనం ఉండటంతో న్యాయవాదులు, కక్షిదారులు టిఫిన్, భోజనం, జిరాక్స్ వంటి అవసరాల కోసం రోడ్డు దాటి వెళ్లవలసిన పరిస్థితి ఉందని, ఇది ప్రమాదాలకు దారితీస్తోందని వారు తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, కోర్టు ఆవరణలోనే అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. మహిళా బార్ అసోసియేషన్ హాల్ పరిమితం కావడం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులపై కూడా చర్చ జరిగింది. దీనిపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తామని హైకోర్టు జడ్జి హామీ ఇచ్చారు. క్యాంటీన్ అవసరాన్ని గుర్తించిన జడ్జి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ కూడా త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిరాక్స్ సెంటర్ ఏర్పాటు పై కూడా చర్యలు తీసుకుంటామని హైకోర్టు జడ్జి వెల్లడించారు. అనంతరం బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. కొత్తగా ఏర్పాటు అయిన బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు జడ్జిని శాలువాతో సత్కరించారు.



న్యాయవాదులు తమ సమస్యలను లేఖరూపంలో జడ్జికి అందజేశారు. ఇటీవల స్టేషన్ ఘనపూర్‌లో కొత్త కోర్టు ఏర్పాటు కావడంతో, పాలకుర్తి, కొడకండ్ల ప్రాంతాల కేసులు ఇకపై అక్కడే విచారణకు వెళ్లుతున్నాయని, అయితే జనగామ కోర్టుతో ఆ ప్రాంత ప్రజలకు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని, మళ్లీ ఆ కేసులను జనగామకే కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమ ముగింపులో హైకోర్టు జడ్జి, జిల్లా జడ్జి, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరామ్, తహసీల్దార్ హుస్సేన్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.హరి ప్రసాద్ యాదవ్, జనరల్ సెక్రటరీ పి. రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు శ్రీరామ్ శ్రీనివాస్, ఎం. జాన్ రెడ్డి, ఎన్. రామ్మోహన్ రెడ్డి, మహిళా సెక్రటరీ సునీత రాణి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మంచాల రవీందర్, ఇతర న్యాయవాదులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సమాజ సేవకు లయన్స్ క్లబ్ అంకితం

## ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజ సేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ పూర్తిగా అంకితమై ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ రెవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన లయన్స్ చారిటబుల్ ఐ హాస్పిటల్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం సమాజ సేవే. వారి సేవలు నిస్వార్థమైనవే కాకుండా, మెరుగైన వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఉచిత కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు వంటి సేవలు పొందుపరచడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఎంపీ, “ఇలాంటి సేవా కార్యక్రమాలకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమైనవని, భవిష్యత్‌లో మరిన్ని సేవలను విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్ రెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు, స్థానిక ఇంచార్జ్ దీపక్ భట్టాచారి, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, లయన్స్ హాస్పిటల్ కోఆర్డినేటర్ వేణు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు వర్కింగ్ జర్నలిస్టులకు తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని సీనియర్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ శరీర అవయవ దాన అసోసియేషన్ సలహాదారుడు డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. దేశాయిపేట శివారులో తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా నిరుపేద జర్నలిస్టులే ఉన్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వారికి వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పౌరులకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులు అర్హులైన సంక్షేమానికి తగిన గుర్తింపు దక్కకపోవడం బాధాకరమని తెలిపారు. పాలకులు రాజకీయ లబ్ధికోసం నిర్ణయాలు తీసుకోకుండా, నిరుపేద వర్కింగ్ జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అందించాల్సిన అవసరముందనిం స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లను అర్హులకే మంజూరు చేయాలి

## ◆ మండల ప్రత్యేక అధికారి విజయ భాస్కర్

**వరంగల్ వాయిస్, పరకాల:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, పరకాల మండల పరిధిలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి విజయ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంజూరైన ఇండ్లు వాస్తవంగా అర్హత ఉన్న నిరుపేదలకే అందాల్సిందేనని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి జనాభా దామాషా ప్రకారం మొదటి విడతగా 3500 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ, గృహాల మంజూరు అనంతరం నిర్మాణం ప్రారంభించగానే బేస్మెంట్ పూర్తయిన వెంటనే రూ.1 లక్ష, గోడలు పూర్తయిన తర్వాత మరో రూ.1 లక్ష, స్లాబ్ వేసిన



వెంటనే రూ.2 లక్షలు, అంతిమంగా పని పూర్తయిన తర్వాత మరో రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. ఇండ్ల నిర్మాణ ప్రగతిని ప్రతి దశలో ఇంజనీరింగ్ సిబ్బంది జియొటాగింగ్ ఫోటోలు ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎవరూ కూడా మధ్యవర్తుల సహాయం ఆశించకూడదని, ప్రారంభం నుండి పని పూర్తి అయ్యే వరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా కలెక్టర్ వరకు అన్ని స్థాయిలలో పర్యవేక్షణ జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# శ్రీవారిని దర్శించుకున్న సమంత

## శుభం చిత్రబృందంతో కలిసి రాక

స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణంలో రాబోతున్న తాజా చిత్రం 'శుభం'. 'చచ్చినా చూడాల్సిందే' అనేది క్యాప్షన్. ఈ సినిమాకు 'సినిమా బండి'ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తుండగా.. హర్షిత్‌రెడ్డి, శ్రీయా కొంతం, గవిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మే 9 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ చేస్తుంది చిత్రబృందం. ట్రాలాలా బ్యానర్‌పై నిర్మాతగా సామ్ ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమా విజయం సాధించాలని తాజాగా సామ్‌తో పాటు– చిత్రయూనిట్ అంతా కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న సామ్‌తో పాటు శుభం చిత్రబృందానికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు– చేశారు. సామ్ క్రిస్టియన్ కావడంతో దర్శనంకి ముందు డిక్లరేషన్‌పై సంతకం చేసిన ఆమె అనంతరం స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంది. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి శాలువాతో సత్కరించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు.




# దానిపై అంతగా ఆసక్తి లేదు



- పెళ్లి ఎప్పుడో కూడా చెప్పలేను
- థగ్‌లైఫ్ ప్రమోషన్‌లో నటి త్రిష కామెంట్స్

నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా.. నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు. త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండిరచారు. పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పుడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదని ఓ సందర్భంలో చెప్పారు. థగ్ లైఫ్' విషయానికి వస్తే.. మణిరత్నం – కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే ఇది. సుమారు 38 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రమిది. శింబు, త్రిష కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి పెళ్లి సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో చిత్రబృందం పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు– చెప్పారు. ఇందులో పాల్గొన్న త్రిష.. థగ్ లైఫ్'లో అవకాశం వచ్చినందుకు సంతోషంగా భావిస్తున్నా. కమల్‌హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టం అని తెలిపారు.



# అనుష్క ప్రభాస్‌ల జంట ఫోటోలు వైరల్

### ఎఐతో రూపొందించినట్లు ప్రచారం

ప్రభాస్– అనుష్క ఈ జంట పలు సినిమాలలో నటించి బెస్ట్ పెయిర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. వారు సినిమాలలోనే కాదు నిజ జీవితంలోను జట్టు కడితే చూడాలని ఎంతో మంది ఫ్యాన్స్ అనుకుంటున్నారు. కొన్నాళ్లుగా వారిద్దరి రిలేషన్ గురించి నెట్టింట అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. వారిద్దరు ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి పీటలు కూడా ఎక్కబోతున్నారని ప్రచారం జరిగింది. అంతేకాదు ఇటీవలే ఏఐతో వీరిద్దరి పెళ్లి ఫొటోలను క్రియేట్ చేయడంతోపాటు– వారికి పిల్లలు కూడా ఉన్నట్లు సృష్టించారు. ఇలా ప్రభాస్ అనుష్కలకి సంబంధించి నెట్టింట ఏదో ఒక ప్రచారం నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రభాస్, అనుష్క క్లోజ్ ఫొటోలని తెగ వైరల్ చేస్తున్నారు. ఇందులో ప్రభాస్ , అనుష్క హగ్ చేసుకున్నట్టుగా ఉంది. ఏఐ సాయంతో ఈ ఫొటోలని రూపొందించినట్టు చెబుతున్నారు. ఇది చూసిన నెటిజన్స్.. ఎందుకు రా ఇలా తయారయ్యారు. ఫేక్ ఫొటోలని క్రియేట్ చేసినందుకు అభిమానులు మండిపడుతున్నారు. ఏది ఏమైన ఈ పిక్స్ మాత్రం సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక ఇప్పటికే ఎన్నోసార్లు డార్లింగ్ పెళ్లి గురించిన చర్చ సోషల్ మీడియాలో వైరలయ్యింది. గత పదేళ్లుగా ప్రభాస్ పెళ్లి గురించి ఏదోక వార్త వస్తూనే ఉంది. ప్రభాస్, అనుష్క జోడి తెలుగు చిత్రపరిశ్రమలో సూపర్ హిట్. వీరిద్దరు కలిసి మిర్చి, బాహుబలి చిత్రాలలో నటించి మంచి పేరు ప్రఖ్యాతలు అందుకున్నారు. త్వరలో ప్రభాస్ స్పిరిట్ అనే చిత్రం చేయనున్నాడు. ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఇందులో కూడా అనుష్కని హీరోయిన్‌గా తీసుకున్నట్టు టాక్ నడుస్తుంది. ఇటీవల అనుష్క సోలో హీరోయిన్‌గా సినిమాలు చేస్తుంది. ఇప్పుడు ప్రభాస్‌తో జత కట్టేందుకు సిద్ధమైనట్టు– తెలుస్తుంది.






# కార్యకర్తలే పునాదిరాళ్లు

- వారు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది
- పార్టీ సిద్ధాంతాలను తెలిపేందుకే శిక్షణ కార్యక్రమం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- బునియాడి ఆదివాసీ కార్యకర్త సమ్మేళన్ శిక్షణ ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సిద్ధాంతాలతో కూడిన రాజకీయ విలువలను కాపాడాలని, దేశంలో ప్రతీ పౌరుడు ఆత్మగౌరవంతో బతికే స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీని, అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ని గౌరవించుకోవాలి అనే ఉద్దేశ్యంతో చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హనుమకొండ హరిత కాకతీయ హోటల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా బునియాడి కార్యకర్తల సమ్మేళన్ మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సభాధ్యక్షత వహించగా వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రాంచంద్రు నాయక్, మురళి నాయక్, దొంతి మాధవ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న దాడిని పేద వర్గాలపైన చేస్తున్న దాడిగా అభివర్ణిస్తూ జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ



చేపట్టారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించారాని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లుతోనే ఈ రోజు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, సర్పంచ్ లుగా, ఎంపీటీసీలుగా అవకాశాలను అందుకోగలుగుతున్నామని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలన్నీ అంబెద్కర్ ని ప్రపంచ మేధావిగా గుర్తిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబెద్కర్ ని ఆ స్థాయిలో గుర్తించడం లేదని అందుకు కులం అడ్డు వస్తుందని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయులు మహాత్మా గాంధీకి దేశంలో ఈ రోజు అవమానం జరుగుతుందన్నారు. బాపు, అంబెద్కర్ లను గౌరవించుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమనికి హాజరైన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న బీజేపీ..

**- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

దేశంలో హింసను, విద్వేషాన్ని వ్యాప్తి చేయడమే ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతమని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మతం, దేవుడి పేరుతో బీజేపీ, ప్రధాని మోదీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రతి ఇంట్లోనూ దేవుడు ఉన్నాడు. కానీ మోదీ మాత్రం దేవుడు తన దగ్గరే ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మోదీ పాలనలో అన్ని వ్యవస్థలనూ నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్ ఘటనపై పార్లమెంట్ లో ఒక్కసారి కూడా మోడీ నోరు మెదపలేదన్నారు. మోడీ విభజించు – పాలించు అనే సూత్రం ఆధారం చేసుకొని పరిపాలన కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, భరత్ చందర్ రెడ్డి, ఏఐసీసీ శిక్షణ తరగతుల కన్వీనర్ రాహుల్ బాలే, బెల్లయ్య నాయక్, ఏఐసీసీ, పీసీసీ ప్రతినిధులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో.. ప్రతి ఒక్కరికీ న్యాయం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజా ప్రభుత్వం పాలనకు నిదర్శనమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం మంత్రి కొండా సురేఖ హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకోపాయారు. వారి సాధకబాధకాలను విన్న మంత్రి అప్పటికప్పుడే అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని కొండా సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎవరు ధైర్యపడవలసిన అవసరం లేదని బడుగు, బలహీన వర్గాలజీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని మంత్రి కొండా సురేఖ భరోసానిచ్చారు.



# నాలల పూడికతీత చేపట్టండి

**⇒ నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహా నగరం వరద ముంపుకు గురికాకుండా నాలల పూడికతీతను ప్రణాళిక బద్దంగా చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వర్షాకాలంలో మహా నగరం వరద ముంపుకు గురికాకుండా నివారణ నిమిత్తం ముందస్తుగా చేపట్టాల్సిన నాలాల పూడికతీత తదితర చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా పరిధిలోని వడ్డెపల్లి, భద్రకాళి, నయింనగర్, బొందివాగు, శాఖరాశికుంట ప్రధాన నాలాలతో పాటు 33 ప్రధాన నాలాలు, యూటీలు, స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ ల పూడికతీత పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి వర్షాకాలం ప్రారంభం కాకముందే ఆయా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ లు శ్రీనివాసరావు, రవి కుమార్, సంతోష్ బాబు, మాధవి, డీఈలు రాజ్ కుమార్, రంగారావు, సారంగం, కార్తీక్ రెడ్డి, ముజమ్మిల్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- డబుల్ బెడ్ రూం సాధించుకుంటాం
- వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మేము పోరాటాలకు గడ్డ అయినా ఓరుగల్లు ముద్దుబిడ్డలం.. మా హక్కుల కోసం, న్యాయంకోసం రాజ్యాంగబద్ధంగా పోరాడుతాం.. జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు సాధించి తీరుతామని వరంగల్ తూర్పు జర్నలిస్టులు ధీమా వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ సాధనకై దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్ షిప్ లో గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేవరకు తాము అండగా నిలుస్తామంటూ హామీ ఇచ్చారు. అయితే కొంత మంది జర్నలిస్టులు రాజకీయ నాయకులకు అంట కాగుతూ ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అసలు వాళ్లు జర్నలిస్టులే కాదు అంటూ అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మేము అసలైన జర్నలిస్టులే కానప్పుడు మాపై పోలీస్ కేసులు పెట్టొచ్చుకదా అంటూ ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న వారే అసలైన జర్నలిస్టులా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలు కాగానే నెల రోజుల్లో డబుల్ బెడ్ రూంలను జర్నలిస్టులకు అందజేస్తానంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు జర్నలిస్టులుగా కనిపించిన వారు నేడు అసలు జర్నలిస్టులుగా కనిపించడం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది కావాలనే దీక్షా శిభిరానికి వచ్చే వారిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వీరి వ్యవహారాన్ని




నిజమైన జర్నలిస్టులు చీదరించుకుంటున్నారన్నారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు భేషజాలకు పోకుండా సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి అర్హులందరికీ డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com